# "సావిత్రి కోరిక"

పాలగిరి వేణు

బ్రహ్మానందానికి రెండు రోజుల్లో బోనస్ వస్తోంది...ఆ రాత్రి బోనస్ యిస్తున్న సంగతి సావిత్రికి చెప్తూ పొదుపు గురించి ఓ అరగంటసేపు ఉపన్యాసమిచ్చి...వచ్చే బోనస్ డబ్బును ఎన్.ఎస్.సి. సర్టిఫికెట్లు కొనేద్దామనుకున్నాడు. సావిత్రి ఆ ఉపన్యాసాన్ని ఊకదంపుడుగా తీసుకుని, బోనస్‌తో ఏ ఫ్రిడ్జియో, టి.వి.యో, సోఫా సెట్టో...కనీసం ఓ చిన్న గాడ్రెజ్ బీరువానైనా కొనాలనే తన ఉద్దేశ్యాన్ని బ్రహ్మానందానికి తెలియబరిచింది.

పెళ్లయి పట్టుమని పదేళ్లయినా యింట్లో చెప్పుకోదగ్గ వస్తువు అంటూ ఏమీ లేవు...

పొదుపు...పొదుపు అంటూ వచ్చిన జీతాన్ని ఏ 'ఫిక్సడ్ డిపాజిట్ల'లోనో, పోస్టాఫీసు సేవింగ్స్‌లోనో వేసేస్తూ బొటాబొటిగా తిండికి ఏ మాత్రం ఢోకా లేకుండా, ముగ్గురు పిల్లలతో సంసార చక్రాన్ని తిప్పేస్తున్నాడు బ్రహ్మానందం.

ఇక శ్రీవారి పిసినారితనాన్ని ఎలాగూ మార్చలేం...మనమే యీయనకు దాసోహమవటం మంచిదని పెళ్లయిన సంవత్సరానికల్లా మారిపోయింది సావిత్రి...

సావిత్రి ఉద్దేశ్యం వింటూనే బ్రహ్మానందానికి బ్రహ్మాండం బద్దలయింది. బ్రహ్మానందం కెవ్వుమన్నాడు...


సావిత్రి యిలా ఫ్రిడ్జి. టి.వి. వగైరాల గురించి మాట్లాడుతుందనుకోలేదు... ఆమె వూహాలో కూడ కోరకూడదు. ఇక మొదలెట్టాడు బ్రహ్మానందం...

"మనలాంటోళ్లకు 'ఫ్రిడ్జ్' ఎందుకే? దాంట్లో ఏం పెడదామని? ఆనపకాయ పులుసు వండిపెడతావా? చూడు! ఏ బీరో, బ్రాందో తాగేవాళ్లకు అవసరం కాని మన బోటి వాళ్ల కెందుకే? యికపోతే తినగా మిగిలిన వంటల్ని 'ఫ్రిడ్జి'లో పెట్టొచ్చుగా అంటావా? మనింట్లో తినగా మిగిలేందుకు ఏమంత వండి పడేస్తున్నావని? పోనీ మిగిలాయే అనుకో! ఎదురింటి ఏకాంబరంగారి 'ఫ్రిడ్జి' ఎలాగూ వుందిగా! వాళ్ల అవసరాల కన్నా మనమే ఎక్కువ వాడుతుంటామాయె! చల్లటి మంచి నీళ్లంటావా? ఏ అర్ధరాత్రి ఒంటి గంటకు వెళ్లి తలుపుకొట్టి మంచినీళ్లడిగితే విసుక్కోకుండా ఐస్ నీళ్లిస్తున్నారు గదా?...ఇక ఎందుకే ఫ్రిడ్జి...?"

ఇక టి. వి. అంటావు! ఆ టి.వి. మాటెత్తితేనే నాకు డోకు వస్తుంది... ఆవు పేడ ఎలా పెడ్తుంది? పందుల్ని ఎలా పెంచాలి? బట్ట మేక పిట్టను ఎలా రక్షించాలి...యివ్వేగా! ఇక మిగిలేవి హిందీ ప్రోగాములు...పచ్చీస్‌కు పచ్చాసుకు వ్యత్యాసం తెలియని మనకు హిందీ ముక్క ఒక్కటైనా అర్థమయి ఛస్తోందా? ఎలాగూ ప్రక్కింటి పరమేశం గారింట్లో టి. వి. వుందిగా! శనాదివారాలు తిండితిప్పల్లేకుండా వాళ్లింట్లోనే గడిపేస్తున్నారు మన పిల్లలు...ఇక మనిద్దరం...టి.వి.లో వచ్చే సినిమాలు, సీరియల్సూ పరమేశం గారింట్లోనే కూచుని చూస్తుంటామాయె! ఇక ఎందుకే టి. వి.?

ఇక సోఫా లంటావా? మనింటికి రోజూ ప్రధాని రాజీవ్ గాంధీ, ప్రెసిడెంట్ వెంకట్రామన్ లాంటి గొప్పోళ్లు వస్తున్నారనా? లేకపోతే చిరంజీవి, శ్రీదేవిలాంటి వాళ్లు వస్తున్నారనా? పాపం రోజూ వస్తున్నారు...వాళ్లు ఎలాగూ రోజూ కింద కూచోపెట్టలేం...కనీసం సోఫాలుంటే పైన కూచునేవాళ్లు అని బాధపడుతున్నామా? మన పిల్లలు ఎగిరి గంతేసి, చింపి పోగులు పెట్టరటే! ఒక్కసారి పాడయిపోతే అవెందుకూపనికి రావు ? కుప్ప తొట్లో వేయాల్సిందే? ఇక ఎందుకే సోఫాలు...?

ఇక బీరువాలంటావా? బంగారు నగలేమైనా...లేకపోతే పట్టుచీరలు గాని వున్నాయటే? డబ్బు, దస్కం నాకు తెలియకుండా ఏమైనా దాచిపెడ్తున్నావా? చూడు...మనింట్లో విలువైన వస్తువులున్నాయని మనమేం




16, ఫిబ్రవరి 1990

విడుదల!

యండమూరి వీరేంద్రనాథ్

సారథ్యంలో



హారిక

సంపూర్ణ కుటుంబ వారపత్రిక

నాని పబ్లికేషన్స్

3-6-584/H, హిమాయత్‌నగర్,

హైదరాబాద్-29, ఫోన్: 65760


బాధ పడనక్కర్లేదు మన పెళ్లిలో నీతో బాటు మీ నాన్నగారిచ్చిన ట్రంకుపెట్టె నిండటం లేదు? అదిగాక దొంగోళ్ల చూపంతా బీరువాల మీదేనే పిచ్చిదానా? పోనీ అన్నీ వున్నాయి - మనింట్లో యిక లేనిదీ బీరువా ఒక్కటేనంటావా? అదే తక్కువయిందా? చెప్పు!...అందుకని నేను చెప్పేదేమిటంటే..." అంటూ తన హార్మోనియాన్ని వివిధ రాగాలలో వాయించి, కొంత అలసి... మంచినీళ్ల కోసం చెంబువైపు సావిత్రికి సైగ చేశాడు బ్రహ్మానందం...

"ఇక ఆపండి! మీ సొద...! మీరేం చెప్పినా వినను...వినను... వినను. పెళ్లయినప్పటి నుంచి మిమ్మల్ని ఏవైనా అడిగానా! పోనీ ఎదురుచెప్పానా? మీకు వచ్చే బోనస్ డబ్బుతో ఏదైనా కొనాల్సిందే! లేకపోతే ఏంటండీ ! ప్రక్కింటి పంకజాక్షి నిన్న మన పిల్లలు వాళ్లింటికి టి.వి. చూడటానికి వెళ్తే... ఎంత అవమానం! వాళ్ల పిల్లల్ని, యింటికొచ్చిన చుట్టాల పిల్లల్ని తమ సోఫాలమీద కెక్కించేసి, మన వెధవలకు 'చాప' వేసి కింద కూచోబెట్టిందట... వాళ్లకేనా టి.వి. వుండేది...ఎంత పొగరు...ఇక ఎదురింటి ఎంకటలక్ష్మి... దాన్ని చూస్తేనే నా గుండె మండిపోతుందండీ! మొన్నరాత్రి మన నాని గాడు మిగిలిన చేపల పులుసును వాళ్ల ఫ్రిడ్జిలో పెట్టటానికి తీసుకెళ్తే...! ఏం ! యీ గెరిటెడు పులుసు మింగలేకపోయారూ ! ఇంత చిన్న గిన్నెను కూడా ఫ్రిడ్జిలో దాచాలా ! ఏమిటి ? అని విసుక్కుందట...

ఈ అవమానాల్ని భరించలేనండి...." అంటూ ఆపి, మండి పొగలు గక్కుతున్న తన శరీరాన్ని చల్లబర్చేందుకు, ఆ చెంబులో మిగిలిన రెండు గుక్కల నీళ్లను తాగేసింది. ఆవేశంతో సావిత్రి.....

"అబ్బ! ఎంత వేడిగా వున్నాయండి నీళ్లు...ఎలా తాగాలో ఏంటో? ఒరేయ్! నానీ! ఎంకటలక్ష్మి ఆంటీ యింటికెళ్లి ఓ సీసాడు చల్లటి నీళ్లు తెచ్చిపెడ్తూ.. .."అంటూ నానీని బతిమలాడి, ఎంకటలక్ష్మి యింటికి పంపింది. సావిత్రి.... అప్పుడురాత్రి పదిగంటలు.....

"అందుకని...నేను చెప్పేదేమిటంటే..." అంటూ మొదలెట్టింది సావిత్రి... కళ్లల్లోంచి జలపాతాలు....ముక్కు బర్రున ఓసారిచీదింది..... అదిరిపోయాడు బ్రహ్మానందం....పదేళ్లలో మొట్టమొదటిసారిగా'లావా' పొంగింది. పెనుతుఫాను వీచే హెచ్చరికలు... ఇక లాభం లేదు. ఏ నాడు ఏ మాటకూ ఎదురు చెప్పని సావిత్రి యిలా బాధపడుతుంటే తన సంసారనౌకకి సరిగ్గా తెడ్డువేయలేదు...సుఖసంసారానికి దూరం కాలేదు. ఒకోసారి పరిస్థితులకు తల వొగ్గాల్సిందే!...

"ఏదో ఒకటి కొందాం సావిత్రీ! ఫ్రిడ్జి, టి.వి. మనకొచ్చే బోనస్‌కు ఏ రెండింతలో వుంటాయి. కాబట్టి అవి ప్రక్కన వుంచు....అదీగాక వాళ్లింట్లో వున్నవి మనం కొనుక్కోవటం గొప్ప కాదు...వాళ్లింట్లో లేనివి కొంటేనే మనకు డాబుగా వుంటుంది.... ఏమంటావ్?" నంగి నంగిగా అన్నాడు బ్రహ్మానందం.

సావిత్రికి తలదిమ్మదిరిగింది...లేకపోతే ఏంటి తన శ్రీవారి నుండి యిలా... యిలా వింటం మొదటిసారి. సంతోషంతో వుక్కిరిబిక్కిరయింది.....

"నిజమేనండోయ్!" అంటూ పెద్ద కేకే పెట్టేసింది. ఎంత ఆలోచించినా తనకు లేనిది వాళ్లకున్నవి ఏమిటి? వాళ్ల కుండి తనకు లేనివి ఏమిటి?.....

వాళ్లకు అన్నీ వున్నాయి....మనకే ఏ ఒక్కటి లేవు.... ఏ మయితేనేం? బోనస్‌కు సరిపడేలా ఏదో ఒకటి... అదే చుట్టుప్రక్కల యింట్లో లేనిది రేపు కొనేయాలని నిర్ణయించుకున్నారు బ్రహ్మానందం, సావిత్రీను....

"ఇక మీరు పడుకోండి....రేపు వుదయం పెసరట్టు చేస్తా... పెసలు నాన బోయాలి... ఏంటో రుబ్బుడురాయి మరేచిన్నదయిపోయింది...రుబ్బాలంటే ప్రాణం పోతోంది అని విసుక్కుంటూ వంటగదిలోనికి వెళ్లిపోయింది సావిత్రి....

పెసరట్టంటే ప్రాణం బ్రహ్మానందానికి?

అతడి బుర్రలో ఓ పెద్ద మెరుపు మెరిసింది తను రేపు కొనబోయే వస్తువు ఏంటో?

* *

సాయంకాలం ఐదు గంటలయింది....

తలుపుచప్పుడయితే వెళ్లి తీసింది....ఎదురుగ్గా ఎదురింటి ఏకాంబరం భార్య ఎంకటలక్ష్మి... దిగ్రేట్ ఫ్రిడ్జ్ ఓనర్...ఆమె చేతిలో ఏదో గిన్నె...దాంట్లో ఏముందో సరిగా ఆనటం లేదు....

"రాండి! వదినగారూ!!" అని సావిత్రి ఆహ్వానిస్తున్నా చూపంతా ఆ గిన్నెమీదే వుంది... ఏదైనా అప్పుకోసం వచ్చిందాంటే, తను వెళ్లే ఆనవాయితేగాని తమింటికి ఎవరూ రారు... వచ్చినా పట్టుకెళ్లేందుకు తనింట్లో సరిగా ఏముంటున్నాయి గనుక. ఎంకటలక్ష్మి ఏదైనా కొత్తరకం వంట ఏదైనా చేసి రుచి చూపించేందుకు తీసుకొచ్చిందా?

"చాలా సంతోషం వదినగారూ! మీరు

'గ్రైండర్'కొంటున్నారంటగా! మాట వరుసకైనా చెప్పలేదేమిటమ్మా! ఇందాక అన్నయ్యగారు 'గ్రైండర్'కొనాలని ఆఫీసులో పర్మిషన్ పెట్టిబయటకెళ్లారట....మా వారు చెప్పారు...అన్నయ్యగారు వచ్చేశారా? గ్రైండర్ తెచ్చేశారా! నీవు చాలా అదృష్ట వంతురాలివి వదినా! 'గ్రైండర్' కొనమని మా శ్రీవార్ని ఎంత గీచి పోరుతున్నావున్న 'మిక్సీ'తోటే నీ రుబ్బుళ్లు సర్దుకో అంటారు గానీ గ్రైండర్ కొనరు.... మా వారి దంతా ఛాదస్తం వదినా! పోనీద్దూ...! అయినా అన్నయ్యగారింకా రాలేదా? వచ్చేశారా? గ్రైండర్ తెచ్చేశారుగా... కోయంబత్తూరు గ్రైండర్లయితే చాలా మంచివట... " అంటూ ఆగింది ఎంకటలక్ష్మి...

"ఏంటో వదినా! మావారు ఫ్రిడ్జి కొందామన్నారు. చన్నీళ్లు తాగితే గొంతుపాడవుతుందని, నిలవ వస్తువులు తింటే గుండె దెబ్బతింటుందని నేనే వద్దన్నాను. అదీగాక ఒక్క వేసవి మాత్రమే ఫ్రిడ్జి కావాల్సి వచ్చేది. అందుకని ఫ్రిడ్జి వద్దని, గ్రైండర్ కొనమన్నాను..." అంటూ సావిత్రి మెడలోని పుస్తెలతాడును అదో 'స్టైల్'గా సవరించుకుంది. నిజంగా సావిత్రికే తెలియదు శ్రీవారు బ్రహ్మానందం గ్రైండర్ కొంటున్నారని. "చూడు! వదినా!! నాకో చిన్న సాయంచేయాలి.. ఈ గిన్నెలో నానబోసిన బియ్యం, మినపప్పు వున్నాయి....మీ 'గ్రైండర్'లో రెండు వాయలు రుబ్బి పెట్టరూ! ఆఫీసు నుండి వస్తూ వస్తూ 'ఫస్ట్‌షో' కని టికెట్లు తీసుకొచ్చేశారు మీ అన్నయ్యగారు..." అంటూ తను తెచ్చిన గిన్నెను సావిత్రి చేతుల్లో అదాటుగా పెట్టేసి పారిపోయింది ఎంకటలక్ష్మి.....

సావిత్రి ఒక్కసారిగా ఆశ్చర్యపోయింది.... ఎంకటలక్ష్మి తన మీద కసి తీర్చుకుంటుందేమిటి? గిన్నెను వళ్లో పెట్టుకుని తలపట్టుకు కూర్చుంది సావిత్రి.

తలుపు దగ్గర ఏదో చప్పుడు... తలెత్తి చూసింది. ప్రక్కింటి పరమేశం గారి భార్య పంకజాక్షి...ది ప్రిస్టేజియస్ కలర్ టి.వి. ఓనర్...పంకజాక్షి చేతిలో ...ఏ గిన్నేలేదు... కొంత సంతోషించింది సావిత్రి...

"రాండి! పంకజాక్షి గారూ"

"రాక ఛస్తానేమిటి? పనున్నాక రావాల్సిందేగా? 'గ్రైండర్' కొనవయ్యా మగడా అంటే నీ ఒంట్లో కొవ్వు, బరువు తగ్గాలంటే గ్రైండర్లు, మిక్సీలు జాంతానై అంటారు మీ అన్నయ్యగారు....చెప్పు...ఎక్కడ కూలబడాలో?" పంకజాక్షిది భారీ శరీరం.. కొంత సేపు నిలబడాలంటేనే అలిసిపోతుంది. ఎక్కడో ఒక చోట కూలబడాల్సిందే!

ఇంట్లో వున్నది ఒకే ఒక చెక్క కుర్చీ... పంకజాక్షి దానిపై కూలబడితే ఆ కుర్చీ సాయంకాలానికి పొయ్యిలోనికి పనికొస్తుంది. ఆ సంగతి పంకజాక్షికి కూడా తెలుసు... నేల మీదే కూలబడింది....

"గ్రైండర్ చూపించరేం?"

"ఇంకా మీ అన్నయ్యగారు యింటికి తీసుకురాందే! గ్రైండర్ వద్దు... కలర్ టి.వి. తెస్తానన్నారు....నేను ఒప్పుకోలేదు.... కలర్ టి.వి.రోజూ చూస్తే 'క్యాన్సర్' వస్తుందట. ..." అంటూ మరోసారి పుస్తెలత్రాడు సవరించుకొంది సావిత్రి యింకో స్టైల్లో...

ఇంతలో పంకజాక్షి కూతురు వనజాక్షి వచ్చింది.... అమ్మాయి చేతిలో గిన్నె లేదు... కాని పెద్ద స్టీలు డబ్బా వుంది.

"ఇదిగో! ఈ స్టీలు డబ్బాలో నానపోసిన సెనగపప్పు వుంది. ఆవడలు చేయాలి... గ్రైండర్ వస్తూనే రుబ్బి పంపించు... బాగా మెత్తగా వుండాలి... మరినే వస్తా!...." అంటూ లేవబోయిన పంకజాక్షి లేవలేక తసికిలపడింది.

"అలా చూస్తారేం?" గుర్రుగా అంది పంకజాక్షి.... పంజాక్షిని ఎలాగైతేనేం సావిత్రి లేవనెత్తి, నిలబెట్టింది.

"వస్తా! పిండి కాటుకలా వుండాలి."

పంకజాక్షి నడక చిన్న గున్న ఏనుగు నడకలా వుంటుంది... మాట కటువు అయినా మనసు మెత్తనిది.

సావిత్రి ఆలోచనలతో మునిగిపోయింది... శ్రీవారు గ్రైండర్ కొంటారని ఆఘమేఘాల మీద అందరికి తెల్సిపోయింది... అయినా ఇంటికి గ్రైండర్ రాకపోయినా ప్రక్కింటి, చుట్టుప్రక్కల వాళ్ళ డబ్బాలు.. గిన్నెలు రుబ్బటానికి వచ్చేస్తున్నాయి. తనకు గ్రైండర్ కొంటున్నానని శ్రీవారు చెప్పి యుంటే తను వద్దనేది.... వాళ్ళ టి.వి.లు చూస్తున్నామని, వాళ్ళ ఫ్రిడ్జ్‌లు వాడుతున్నామని యిప్పట్నించే 'అథారిటీ' చూపిస్తున్నారు వీళ్ళందరూ!.....

మళ్ళీ తలుపు దగ్గర చప్పుడు.... రిక్షా దిగుతున్నారు శ్రీవారు... అంటే 'గ్రైండర్' కొనే వుంటారన్నమాట.....

"ఏంటే అలా కూరుచ్చున్నావ్ అశోకవనంలో సీతమ్మలా... ఏంటే! నీ చుట్టూ ఈ డబ్బాలు గిన్నెలూ...."

"గ్రైండర్ కొన్నారా లేదా ముందు చెప్పండి..."

"నేనెక్కడ కొంటానే, నిజంగా కొందామనే వెళ్ళాను... ఏంలాభం... మార్కెట్లో గ్రైండర్లేలేవు... స్టాకు పూర్తిగా అయిపోయిందట.... మూణ్ణెల్ల వరకు స్టాకురాదట... అంతవరకు డబ్బు మన దగ్గర వుంచుకోవటం ఎందుకని పోస్టాఫీసులో కట్టేశాను. స్టాకు వచ్చినప్పుడు కొనుక్కోవచ్చని... అయినా నీకెలా తెలుసూ! నేను గ్రైండర్ కొంటున్నానని..."

సావిత్రి మౌనంగా వుంది... కాని ఆమె చూపంతా శ్రీవారిపైనా... అటు స్టీలు గిన్నెలు... ఇటు స్టీలుడబ్బాలు... మార్చి మార్చి చూస్తుంటే బ్రహ్మానందం అర్థం గాక తనూ మౌనంగా నిలబడిపోయాడు... ●

## రాజేష్‌ఖన్నా పునరాగమనం



చాలా రోజులు చిత్ర రంగానికి దూరమైపోయిన రాజేష్‌ఖన్నా తిరిగి మళ్ళీ తెర మీదకు రాబోతున్నాడు.

'ఘర్ కా చిరాగ్', 'స్వర్గ్' చిత్రాల్లో నటిస్తున్నాడట రాజేష్. గతంలో సూపర్ స్టార్‌గా వున్న రోజుల్లో షూటింగ్‌కు ఆలస్యంగా వెళ్ళే అలవాటున్న రాజేష్‌ఖన్నా ఇప్పుడు సకాలంలో షూటింగ్‌కు రావటం, షాట్స్ అయిపోయే వరకు వుండటం చేస్తున్నాడట. మరి యిదివరకటిలా చేస్తే యింతే సంగతులని గ్రహించాడనుకుందామా?